RNI : APTEL / 2023 / 89152

1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ వెలుగు
SHANMUKHAVELUGU

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 227 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 14 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 227 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 14 July 2025 PAGES : 8 PRICE : 3/-

# కోట శ్రీనివాసరావు జీవితంలో కోల్పోయినవి ఆ రెండే..



(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్,జూలై 13)
విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు లేరనే వార్త చిత్ర పరిశ్రమతో పాటు, యావత్ తెలుగు ప్రేక్షకులను దిగ్భ్రాంతికి గురి చేసింది. వందల సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలతో అలరించిన ఆయన ఆదివారం తుది శ్వాస విడిచారు. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. 40ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన ఆయన తన జీవితంలో కోల్పోయిన విషయాలు రెండే రెండు ఉన్నాయని ఓ సందర్భంలో గుర్తు చేసుకుని బాధపడ్డారు. “నా మొత్తం జీవితంలో కోల్పోయిన విషయాలు రెండున్నాయి. ఒకటి సరైన సమయంలో కుటుంబంతో గడపలేకపోయాను. షూటింగ్స్ ఉండి నెలకో, రెండు నెలలకో ఓసారి ఇంటికి వచ్చిన సందర్భాలున్నాయి. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు. పిల్లల చిన్నతనంలో వారి అచ్చటా ముచ్చట పెద్దగా చూసుకుంది లేదు. వారి వెనకాల ఉండి నడిపించింది లేదు. నా అదృష్టం ఏంటంటే పిల్లలు చదువుకుని, బుద్ధిమంతులయ్యారు. ఇక రెండోది- జనరల్ నాలెడ్జ్ లేకుండా పోయింది. పొద్దున్న ఐదింటికో, ఆరింటికో వెళ్లిపోయేవాడిని. తిరిగి వచ్చేసరికి అర్ధరాత్రి దాటి ఏ రెండో అయ్యేది. ప్రపంచంలో ఏం జరుగుతుందనేది కూడా పట్టించుకోలేదు. ఈ రెండింటి గురించి తలుచుకొని నాలో నేను ఏడుస్తూ ఉంటాను. నా జీవితం ఎలా అయిపోయిందంటే అప్పుడు తినడానికి టైమ్ లేదు. ఇప్పుడు తిందామంటే తినలేను. అప్పట్లో ఎవరు ఏం చేసేవారో కూడా తెలిసేది కాదు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు.. ఏవీ పట్టేవి కావు. ఎవరికైనా టైమ్ వస్తే టైమ్ ఉండదని అర్థమైంది. ఆ రోజులు అలా గడిచిపోయాయి” -మిగతా 2లో

# సింగపూర్ పర్యటనకు వెళుతున్న సీఎం చంద్రబాబు

**ఈ నెల 26 నుంచి 30 వరకు సింగపూర్ పర్యటన**
**చంద్రబాబుతో పాటు వెళ్లనున్న మంత్రులు లోకేశ్, భరత్, నారాయణ, అధికారులు**
**పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన అజెండా**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 13)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 30 వరకు ఆయన పర్యటన సాగనుంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనలో చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, నారాయణ, ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు.
సింగపూర్ పర్యటనలో చంద్రబాబు బృందం అక్కడి ప్రభుత్వ పెద్దలతో మరియు వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను వారికి వివరించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా తెలియజేస్తారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం మరియు మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నాలు జరగనున్నాయి.
రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు చేస్తున్న విదేశీ పర్యటనలు రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైనవిగా భావిస్తున్నారు. గతంలో కూడా ఆయన పలుమార్లు విదేశాల్లో పర్యటించి భారీ ఎత్తున పెట్టుబడులను -మిగతా 2లో



# బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసమా? మహేశ్‌కుమార్ గౌడ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 13)
ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు, క్యూ న్యూస్‌పై దాడి ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ రెండింటినీ ఆయన ఖండించారు. కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమని.. గన్‌మన్ కాల్పులపై విచారణ జరుగుతోందని తెలిపారు. కాంగ్రెస్ కృషి ఫలితమే బీసీ బిల్లు, రిజర్వేషన్లు అని మహేశ్‌కుమార్ చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసం కాదన్నారు.

# వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

**: సీఎం నీతీశ్ కుమార్**



(షణ్ముఖ వెలుగు,ఢిలీ, జూలై 13)
(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 13)
బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ (%శ్రీరిశిరిరీనీ చతిళీబిజీ%) ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 2025-2030 మధ్య కాలంలో -మిగతా 2లో

# ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ దొందూ దొందే

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 13)
కేరళలో సీపీఎం నేతృత్వంలోని అధికార ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ కూటములు రెండూ అవినీతిని పెంచి పోషించాయని, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతూ కేరళను ‘పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా’ (పీఎఫ్‌ఐ) వంటి జాతి వ్యతిరేక శక్తులకు నెలవుగా మార్చాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని ఎన్‌డీయే మాత్రమే కేరళ ప్రగతికి బాటలు వేయగలదని చెప్పారు. శనివారం తిరువనంతపురంలో భాజపా రాష్ట్ర కమిటీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి, కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడారు. దక్షిణాదిని బలోపేతం చేయకుండా వికసిత భారతాన్ని సాధించడం సాధ్యం కాదని, దానిలో కేరళ అభివృద్ధి ముఖ్యమైనదని అన్నారు. ముఖ్యమంత్రిని కలిగి ఉండటానికే కాకుండా వికసిత కేరళానికి కేంద్రంగా భాజపా రాష్ట్ర కార్యాలయం ఉండేలా చూడటం ముఖ్యమని చెప్పారు. కేంద్రం 2022లోనే పీఎఫ్‌ఐని, దాని అనుబంధ సంస్థల్ని నిషేధించినా కేరళ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సీపీఎంకు దాని కార్యకర్తల అభివృద్ధే తప్ప రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం కాదన్నారు. ప్రతిపక్షాలు బలంగా ఉన్న అస్సాం, త్రిపుర వంటి రాష్ట్రాల్లో కూడా భాజపా ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని, తమిళనాడులో కూడా అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.



# భారత్‌తో బంధంలో ఓ సమస్య..దలైలామా వారసుడి ఎంపిక: చైనా

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 13)
టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని



భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని..ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.
2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం.
దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ.. -మిగతా 2లో

# స్పేస్ పాలసీ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

**ఐదేళ్ల కాలవ్యవధితో ఏపీ అంతరిక్ష విధానం**
**స్పేస్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆదేశాలు**
**దేశీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 13)
ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ఐదేళ్ల కాలానికి వర్తించే కొత్త అంతరిక్ష విధానాన్ని (స్పేస్ పాలసీ) ప్రకటించింది. ఈ విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర స్పేస్ సిటీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.ఈ స్పేస్ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం పెట్టుకుంది. దేశీయ, అంతర్జాతీయ సంస్థలను ఈ ప్రాజెక్టులలో -మిగతా 2లో

# వైసీపీ నాయకుల్లో ఒక మహానటి ఉంది

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 13)
రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైసీపీ నాయకులపై తీవ్ర ఆరోపణలు చేశారు. వైసీపీ నాయకత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు చేస్తోందని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి పైశాచిక రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల్లో ఒక మహానటి ఉందన్నారు. -మిగతా 2లో



# సింగపూర్ పర్యటనకు వెలుతున్న సీఎం చంద్రబాబు

రాష్ట్రానికి తీసుకురావడంలో సఫలమయ్యారు. సింగపూర్ పర్యటన కూడా అదే కోవలో జరుగుతుందని భావిస్తున్నారు.

ఈ పర్యటన ద్వారా సింగపూర్ మరియు ఆంధ్రప్రదేశ్ మధ్య సంబంధాలు మరింత బలపడతాయని ఆశిస్తున్నారు. అంతేకాకుండా, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు ఉత్తమ విధానాలను కూడా స్వీకరించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

# కోట శ్రీనివాసరావు జీవితంలో కోల్పోయినవి ఆ రెండే..

“నా కొడుకు మరణం నాకు చాలా పెద్ద దెబ్బ. ఎంతో బాధను మిగిల్చింది. ఆత్రేయగారు అన్నట్టు.. ‘అనుకున్నామని జరగవు అన్నీ.. అనుకోలేదని ఆగవు కొన్ని’ జీవితం వెళ్లిపోయింది.. వెళుతోంది.. ఈ వయసులో పితృశోకం భరించవచ్చు. పుత్ర శోకం భరించలేం. తండ్రిగా ఆ బాధను అనుభవిస్తున్నాను. ఈ దుఃఖాన్ని ఎవరూ పూడ్చలేరు. దేవుడు ఈ కష్టం ఇచ్చాడని ఏడుస్తూ కూర్చుంటే నన్ను నమ్ముకున్నవారు ఉన్నారు. వాళ్లేమై పోతారు. ఎలాగూ తప్పదు కాబట్టి.. నడిపించాలి అంతే” అని పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ కోట బాధపడ్డారు.

**అందుకే హీరోగా చేయలేదు!**

అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావు హీరోగా మాత్రం చేయలేదు. అందుకు కారణాన్ని కూడా పంచుకున్నారు. “నేను పరిశ్రమలోకి వచ్చేటప్పుడే దృష్టి హీరో పాత్రలపై లేదు. నాకప్పటికే 40 వచ్చాయి. ఇప్పటికీ నా ఇంటి ముందు నుంచి ఎవరైనా వెళ్తే ‘నటుడు కోట శ్రీనివాసరావు ఇల్లు’ అనుకుంటారు. అదే నేను తదుపరి కాలంలో హీరోగానో, దర్శకుడిగానో, నిర్మాతగానో అయి ఉంటే ‘వీడికెందుకురా ఈ పనులు’ అని పరాచకాలు ఆడి ఉండేవారు. నాకు అది ఇష్టం లేదు. హీరోగా చేయాలన్న ఆలోచన లేదు కాబట్టే ఇంకా జీరో కాకుండా ఉన్నాను. పరిశ్రమకు ఎంతగానో రుణపడి ఉన్నాను” అని చెప్పుకొచ్చారు.

# స్పేస్ పాలసీ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

భాగస్వామ్యులుగా చేసుకోవాలని సూచించింది.

స్పేస్ సిటీ కార్పొరేషన్ అంతరిక్ష ప్రాజెక్టుల అమలుకు సహాయం చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ స్పేస్ సిటీలు సత్యసాయి మరియు తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేయబడతాయి. భూ కేటాయింపులు మరియు దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియలు ఒక కమిటీ ద్వారా అనుమతులు పొందుతాయని ప్రభుత్వం తెలియజేసింది.

మొదటి పేజీ తరువాయి

# భారత్‌తో బంధంలో ఓ సమస్య..దలైలామా వారసుడి ఎంపిక: చైనా

చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు.అది భారత్‌లో కూడా కావచ్చని వ్యాఖ్యానించారు. తన వారసత్వంపై నిర్ణయం తీసుకునే హక్కు చైనాకు లేదని స్పష్టం చేశారు. అనంతరం దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల దలైలామా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన భారత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ..15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేశారు.

# వైసీపీ నాయకుల్లో ఒక మహానటి ఉంది

కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ వివాదంమంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కారును టీడీపీ నాయకులు వదిలేశారని, అయితే ఆమె కావాలనే తిరిగి వచ్చి పోలీసులను, టీడీపీ నాయకులను దుర్భాషలాడారని ఆరోపించారు. ఈ సంఘటనను టీడీపీ నాయకత్వానికి అంటగట్టి, రాష్ట్రవ్యాప్తంగా బీసీలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా, ఆ ప్రయత్నంలో వైసీపీ విఫలమైందని ఆయన తెలిపారు. రాష్ట్రమంతా భగ్గుమనిపించాలని చూసి అడ్డంగా బుక్ అయిపోయారు... ఈ కుట్రల వెనుక వైసీపీ అధినేత జగన్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు.

**వైసీపీ రాక్షస రాజకీయాలు**

వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని కొల్లు రవీంద్ర విమర్శించారు. “వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేయడానికి పూనుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా, పరిశ్రమలు ఏర్పాటు కాకుండా చేశారు. బీసీలను రెచ్చగొట్టి, కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నారు” అని ఆయన ఆరోపించారు. గుడివాడలో సభ పేరుతో రాద్ధాంతం సృష్టించడం, బీసీ మహిళను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూడటం వైసీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

**జగన్ రెడ్డి హత్యా రాజకీయాలు**

వైసీపీ అధినేత జగన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించిన మంత్రి, ఒక దళిత వృద్ధుడిని కారుతో తొక్కించి చంపడం, వివేకానంద రెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించడం వంటి ఆరోపణలు చేశారు. “పేర్ని నాని పామర్రు సభలో ‘చీకట్లో కన్ను కొడితే నరికేయాలి’ అని మాట్లాడారు. ఇలాంటి రాక్షస ఆలోచనలు వైసీపీ నాయకులకు సర్వసాధారణం” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు మానవత్వం లేని పైశాచిక రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజలు వారి నీచ ఆలోచనలను గుర్తిస్తున్నారని హెచ్చరించారు.

**కూటమి అభివృద్ధి ప్రయత్నాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి రవీంద్ర తెలిపారు. “పెట్టుబడులు తీసుకొచ్చి, పరిశ్రమలు ఏర్పాటు చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు మా నాయకులు తాపత్రయపడుతున్నారు. కానీ, వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని అశాంతిలోకి నెట్టాలని చూస్తున్నారు” అని ఆయన విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణం, స్టీల్ ప్లాంట్ లాభాల బాట, ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు ఆర్థిక సహాయం వంటి ప్రభుత్వ కార్యక్రమాలను ఆయన ఉదాహరించారు.

**వైసీపీకి ప్రజల హెచ్చరిక**

వైసీపీ రాష్ట్రంలో హింసాత్మక రాజకీయాలు, కుట్రలు కొనసాగిస్తే ప్రజలు ఊరుకోరని మంత్రి హెచ్చరించారు. “వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినా బుద్ధి రాలేదు. ప్రజలు వారి దుర్మార్గాలను మరచిపోలేదు. రాష్ట్రంలో వైసీపీ జాడ కూడా లేకుండా పోతుంది,” అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించే నాయకుడు చంద్రబాబు అని, టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.“జగన్ లాంటి రాక్షసుడిని ముఖ్యమంత్రిని చేసినందుకు రాష్ట్ర ప్రజలు సిగ్గుపడుతున్నారు. బాధపడుతున్నారు. సభలు పెట్టి నెత్తుటి రాజకీయాలు చేసే వ్యక్తికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు. పార్టీ సభ పెట్టుకోవాలనుకున్నావ్.. పెట్టుకోవాలి. అంతే గానీ ఆ సభను అడ్డం పెట్టుకుని ఆ ప్రాంతంలో రక్తం పారిస్తానంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. ప్రజల్ని రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలనుకుంటున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదా? నరుకుతాం, చంపుతాం, తొక్కుకుంటూ పోతామని రాక్షసుడిలా మాట్లాడిన నాయకుడు నీవే. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి.. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడమే కాకుండా.. దాడులు, దౌర్జన్యం కేసులు, కుట్రలతో రాష్ట్రంలో అశాంతి రేపావు. అమాయకుల్ని జైళ్లకు పంపారు. నీ అరాచకాన్ని ఇక భరించలేమని తేల్చి 11 సీట్లకు పరిమితం చేశారు. రేపు మీరేమైపోతారో? తెలియదు” అంటూ కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

# వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయిందన్నారు.

గడిచిన ఐదేళ్లలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు నీతీశ్ చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపు ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. కేవలం ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేటు, ఇతర పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు నీతీశ్ పేర్కొన్నారు.

“ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ప్రైవేటు రంగంలో మరో 39 లక్షల మందికి ఉపాధి కల్పించాం. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల హామీ దాదాపు నెరవేరినట్లే. ఇప్పుడు లక్ష్యాన్ని రెట్టింపు చేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాం. ప్రధానంగా పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉపాధి చూపిస్తాం” అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశముంది.

# ఆహ్లాదంగా గడిపిన చిన్నారులు





**(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 13)**

కొండపిలోని పొదిలి రోడ్డులోని వెంకటేశ్వర స్విమ్మింగ్ ఫూల్లో ఆదివారం చిన్నారులు ఆహ్లాదంగా గడిపారు. ఎండలు ఎక్కువగా కాస్తుండడంతో ఎండవేడికి తట్టుకోలేక చిన్నారులతో కలిసి కుటుంబ సమేతంగా స్విమ్మింగ్ ఫూల్‌లో సేద తీరుతూ సందడి చేశారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు ఊరి చివర అహ్లాదకరమైన వాతావరణంలో స్విమ్మింగ్ ఫూల్ ఉండడంతో రోజు రోజుకి స్విమ్మింగ్ చేయటానికి కొండపి మండలం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా వస్తున్నారు. స్విమ్మింగ్ ఫూల్ యజమానులు ఎప్పటికప్పుడు నీటిని పరిశుభ్రంగా ఉంచడంతో రోజు రోజుకి కుటుంబ సభ్యులతో స్విమ్మింగ్ చేయడానికి చిన్నారులు అమితంగా ఆసక్తి కనబరుస్తున్నారు.

# పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు

**వెలుగు, పొదిలి, జులై 13)**

సుపరిపాలనలో తొలిగడుగు కార్యక్రమంలో భాగంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పొదిలి పట్టణంలోని బూత్ నెంబర్ 236, 14వ వార్డులో ఆదివారం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి, క్లస్టర్ ఇంచార్జ్ గునుపూడి భాస్కర్ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శివాలయం ప్రతిపాదిత చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, పొదిలి ఏఎంసి డైరక్టర్ సోమిశెట్టి శ్రీదేవి, సామి రాజా, కారంశెట్టి కిషోర్, సామి శ్రీను, సామి సూరి, పెరుమాళ్ళ చెంచు నారాయణ, చీద మౌళి, జొన్నలగడ్డ నాగబాబు, సుమంత్, కారంశెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.









# పేదలందరికీ సంక్షేమ ఫలాలు

**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 13)**

అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని బి చెర్లోపల్లి గ్రామ సర్పంచి ఆకుమల్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక మండలంలోని బి చర్లపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. కొద్ది రోజుల్లో అన్నదాతకు సాయం డబ్బులు అందజేస్తారని, వచ్చే నెల 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసు వెంకటేశ్వర్‌రెడ్డి, గురప్ప గౌడ్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 14.07.25
సోమవారం



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ముత్తుముల, ఉగ్ర

(షణ్ముఖ వెలుగు, తిరుమల, జులై 13)

తిరుమలలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి వారిని ఆదివారం ఉదయం రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు (తరువాయి 4లో...)

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

# ప్రకాశం

# మానవతా మూర్తి ఎమ్మెల్యే కందుల కోమాలో ఉన్న కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తా

**ఆపదలో ఉన్న కుటుంబానికి ఆశావాహకంగా హామీలు**

**సమస్యల పరిష్కారానికి అధికారులను చురుగ్గా ఆదేశించిన ప్రజా నాయకుడు**





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 13)

"సేవే శ్రేష్ట ధర్మం - బాధితులను మనశ్శాంతితో ఆదుకోవడం ప్రభుత్వ ధ్యేయం" అని మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని చిదంబరంపల్లి గ్రామంలో తీవ్రమైన అనారోగ్యంతో కొమాలో చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ కార్యకర్త మాలపాటి నారాయణరెడ్డిను ఆయన పరామర్శించారు. వివరాల్లోకి వెళితే పక్షవాతం బారిన పడిన మాలపాటి నారాయణరెడ్డి ప్రస్తుతం కదలలేని స్థితిలో కొమాలో ఉన్నారు. వైద్యం కోసం రూ.15 లక్షలు అవసరమని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీని పై స్పందించిన ఎమ్మెల్యే "ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అవసరమైన ఆర్థిక సాయాన్ని ఇప్పిస్తాం. మీ కుటుంబం ఒంటరిగా లేదన్న భావం కలిగేలా అన్ని విధాల సహకరిస్తాం" అంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అనేక ఇతర సమస్యలను కూడా పరిశీలించారు. నారాయణరెడ్డి కుమార్తె ఉద్యోగం పేరిట ఒక దళారి రూ.2 లక్షలు మోసం చేశాడని వారు చెప్పగా, ఎమ్మెల్యే ఆ దళారి పై కఠిన చర్యలు తీసుకోవాలని పొదిలి ఎస్ఐ వి వేమనకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే భూమి ఆన్లైన్ రికార్డుల్లో అక్రమాలు జరిగాయని, పాస్‌బుక్‌లు రాకుండా చేసిన విషయాన్ని గుర్తించి, తక్షణమే తహసీల్దార్ ఎంవి కృష్ణారెడ్డికి ఫోన్ చేసి ఆన్‌లైన్ నమోదు రద్దు చేసి అసలైన వారికే భూమి హక్కులు ఇవ్వండి" అని ఆదేశించారు. చదువుకున్న యువతికి ఉద్యోగం కల్పించేందుకు వ్యక్తిగతంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే "బాధిత కుటుంబం న్యాయం పొందే వరకు నా అండ కొనసాగుతుంది" అన్నారు. ఈ తీరుతో ఆయన మాటల్లోని ఆత్మీయత, చర్యలలోని చురుకుదనం గ్రామ ప్రజలను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇదే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఈగలపాడు, గొల్లపల్లి, సూదనగుంట, రామాపురం, గురుగుపాడు, అక్కచెరువు గ్రామాలను సందర్శించిన ఎమ్మెల్యేకు ప్రజలు అనేక సమస్యలను వివరించారు. ఈగలపాడు గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని మహిళలు తెలిపారు. సాగర్ నీరు ఇప్పటికీ రాకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. గురుగుపాడు, రామాపురం గ్రామాల్లో భూగర్భజలాల హ్రాసంతో డీప్ బోర్లు వట్టిపోతున్నాయని, తాత్కాలికంగా ట్యాంకర్ల సంఖ్యను పెంచాలంటూ ప్రజలు అభ్యర్థించారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు రావడం లేదని, రెవెన్యూ వ్యవహారాల్లో అక్రమాలు, భూ ఆన్‌లైన్ హక్కుల్లో అన్యాయాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పర్యటనలో టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి మానవీయతతో సహాయం చేసి, ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా విని, వెంటనే అధికారులకు సూచనలు చేయడంలో కందుల నారాయణరెడ్డి చూపిన చొరవ ఒక ప్రజానాయకుని అసలైన ప్రమాణాన్ని ప్రతిబింబించిందని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ఇది పరిపాలనా శైలి కాదు... ఇది మానవతా పథం... సమస్యల పట్ల చిత్తశుద్ధితో స్పందించే నాయకత్వమే ప్రజలకు నిజమైన భరోసా అన్న విషయాన్ని మరోసారి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రుజువు చేశారు.



## హోరా హోరీగా ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 13)

ప్రకాశం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఒంగోలు లార్డ్ కృష్ణ అకాడమీలో ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 12, 13 తేదీలలో లార్డ్ కృష్ణలో జరిగిన జిల్లా స్థాయి 52వ బ్యాడ్మింటన్ పోటీలలో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సత్తా చాటారు. పోటీలు ఆద్యంతం నువ్వా నేనా అన్నట్లు సాగాయి. ఆదివారం జరిగిన పోటీల్లో అండర్ 11 బాలుర సింగిల్స్‌లో విజేత గా చర్విక్ జై, రన్నర్ గా ఆర్య నందన్ నిలిచారు. బాలుర డబుల్స్‌లో అరుపా నందన్, చర్విక్ జై విజేతలుగా జై దేవ్, అఖిల్ రన్నర్ గా నిలిచారు. అండర్ 13 సింగిల్స్ విజేత ఆఫరాన్, రన్నర్‌గా అఖిల్ నిలిచారు. అండర్ 13 డబుల్స్‌లో విజేతగా అఖిల్, సంకల్ప్ నిలిచారు. రన్నర్స్ గా అభిరామ్, రిషి నిలిచారు. అండర్ 15 బాయ్స్ విన్నర్‌గా షణ్ముఖ వర్ధన్, రన్నర్ గా అనూష్, అండర్ 15 బాయ్స్ విజేతలుగా షణ్ముఖ వర్ధన్, అఫ్రాన్ రన్నర్స్‌గా శ్రీయన్స్, అనురాగ్ నియోల్, బాలికలు అండర్ 11 విన్నర్ ఇషిత, (తరువాయి 4లో...)

# కుళ్ళు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ వైసిపి

**సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 13)

కుళ్ళు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా వైసీపీ పార్టీ నిలుస్తుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. " సుపరిపాలనలో తొలి అడుగు " కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఈగలపాడు, చిదంబరంపల్లి, గొల్లపల్లి, సూదనగుంట, రామాపురం, గురుగుపాడు, అక్కచెరువు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. చిదంబరంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యం పాలైన మాలపాటి నారాయణ రెడ్డిని పరామర్శించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి పాంప్లేట్లు పంచి బూత్ ఇన్చార్జిలతో మై టిడిపి యాప్‌లో ఆ కుటుంబాల వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని అయినా కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోనే తమ హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. (తరువాయి 4లో...)



# పొదిలిలో సుపరిపాలనలో తొలి అడుగు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 13)
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పొదిలి బూత్ నెంబర్ 226లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని పొందుపరచిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ మస్తాన్, రఫీ, ఇతర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంఎన్ రెడ్డి, గెల్లి చౌడేశ్వరావులను ఘనంగా సన్మానించిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శశి కీర్తి




(షణ్ముఖ వెలుగు, విజయవాడ, జులై 13)
అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శశి కీర్తి ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ నటుడు, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎంఎన్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది గెల్లి చౌడేశ్వరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శశికీర్తి నిరంతరం పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందించాల్సిన విషయమని కొనియాడారు. అనంతరం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శశి కీర్తి, జూనియర్ నాగార్జున ఎమ్ఎన్ రెడ్డి, గెల్లి చౌడేశ్వరరావులను శాలువాలతో ఘనంగా సన్మానించి, మెమొంటోను అందించారు. ఈ కార్యక్రమంలో అన్వర్, గుడిపాటి నాగరాజు, ఆర్‌కె బాబు, లీల, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పల హారిక పై జరిగిన దాడిని ఖండించిన ప్రకాశం జిల్లా జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 13)
కృష్ణ జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పల హారిక పై జరిగిన దాడిని ప్రకాశం జిల్లా జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ ఖండించారు. ఒంగోలు వైసిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఒక బీసీ మహిళా పట్ల టీడీపీ,జనసేన నాయకులు దాడి చేయడాన్ని వైసిపి పార్టీ ఖండిస్తుందని అన్నారు. కార్యక్రమానికి వెళ్తున్నా జడ్పీ చైర్మన్ హారిక పైన కొంత మంది దాడికి యత్నించారని ఆరోపించారు. మహిళలు అంటే చంద్రబాబుకు చిన్న చూపు అని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎక్కడ కూడా మహిళలపై దాడులు జరగలేదని అన్నారు. మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఇటువంటి దాడులు పట్ల స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతున్న పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు అన్నారు. వైసిపి పట్ల ఈ ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేడికొండ జయంతి, జిల్లా అధ్యక్షురాలు దుంప రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కుళ్ళు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ వైసిపి













ప్రతి విద్యార్థి తల్లులు ఎకౌంట్లో ఒక్కో విద్యార్థికి పదవులు వేల రూపాయలు జమ చేశారని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000లు, కిడ్నీ, కాలేయం, తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10,000లు, పూర్తి వైకల్యం ఉన్న వారికి రూ.15వేలుగా మొత్తంగా రాష్ట్రంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నారని అన్నారు. తమ ఎన్నికల హామీ అయినటువంటి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఇస్తున్నారని అన్నారు. యువతకు 16,347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నారని, పోలీస్ శాఖలు నియామకాలు జరిపారని, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల మంది ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. రైతు సంక్షేమం కొరకు కేంద్రంతోపాటు రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే ప్రారంభం అవుతుందని అన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే న్యాయమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రానికి పలు బహుళ జాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేశారని అన్నారు. గత వైసిపి పాలకులు పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, ఇంకా రూ.4,000 కోట్లు ఖర్చు చేస్తేనే ఆ ప్రాజెక్టు పూర్తి అవుతుందని త్వరలోనే ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. త్వరలోనే ప్రత్యేక మార్కాపురం జిల్లా సకారం చేస్తామని అన్నారు. టిడిపి శ్రేణులు వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తీపి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, ఏ అంజిరెడ్డి, జిల్లా ముస్లింమైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, శివాలయం ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, శివాలయం కమిటీ మాజీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏలూరి సొసైటీ అధ్యక్షులు ఉలవా గోపి, పొదిలి యూనిట్ ఇన్‌ఛార్జి మీగడ ఈశ్వర్‌రెడ్డి, తానికొండ వెంకట్రావు, ముని శ్రీనివాసులు, ఆయా బూత్ ఇన్ఛార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

# హోరా హోరీగా ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



రన్నర్ రీత్విక, డబుల్స్‌లో విన్నర్స్‌గా సహస్ర, ఇషిత, అండర్ 13 సింగిల్స్ విన్నర్ ఇషిత, రన్నర్ ఫియానా, డబుల్స్ విజేతలుగా ఎస్విత, హర్షిణి, రన్నర్స్ రీత్విక, లిఖిత నిలిచారు. అండర్ 15 సింగిల్స్ విజేతగా ఎస్ కె రబియా, రన్నర్ వినూత్న, డబుల్స్‌లో విజేతలుగా వినూత్న, ఎస్ కె రబియ, రన్నర్స్ గా ఎస్విత, సింధు నిలిచారు. అండర్ 17 బాయ్స్ సింగిల్ విన్నర్ జి షణ్ముఖ వర్ధన్, రన్నర్ శ్రేయంష్, డబుల్స్ విన్నర్ గా వై తారక్ రామ్ చరణ్, అరూప్ నియో, రన్నర్ గా వర్షిత్, ఇనాక్ నిలిచారు. అండర్ 19 డబుల్స్‌లో విజేతలుగా జి హర్విత్, అభిలాష్ నిలిచారు. రన్నర్స్‌గా ఎమ్ సూర్య కిరణ్, రుషి నిలిచారు. మెన్స్ సింగిల్స్ విన్నర్ గా ఆర్ రాహుల్, రన్నర్‌గా విజయ పవన్ కుమార్ నిలిచారు. మెన్స్ డబుల్స్ విజేతలు గా రాహుల్, శశి, రన్నర్స్ గా కిరణ్, విజయ్ నిలిచారు. అండర్ 19 మిక్సడ్ డబుల్స్ విజేతలుగా హర్షిత్ సాయి, వినూత్న, రన్నర్స్‌గా రిషి, యశస్విని నిలిచారు. అండర్ 17 బాలికలు సింగల్స్ ఎస్ కె రబియా, రన్నర్ గా భువన శ్రీ నిలిచారు. డబుల్స్‌లో భువన శ్రీ హర్షిత విజేతలుగా, రన్నర్స్ గా సహస్ర, ఎస్విత నిలిచారు. అండర్ 19 బాలికల సింగిల్స్‌లో హర్షిని విజేతగా, రన్నర్‌గా ప్రహర్షిత, డబుల్స్‌లో ప్రహర్షిత, భువన శ్రీ విజేతలుగా, రన్నర్స్ గా హర్షిణి, మిధి నిలిచారు. ఉమెన్ సింగిల్స్‌లో డిఆర్ శర్వాణి, రన్నర్‌గా కమల నిలిచారు. ఉమెన్ డబుల్స్‌లో విన్నర్స్‌గా డి ఆర్ కమల, డి ఆర్ శర్వాణి నిలిచారు. రన్నర్స్‌గా శిల్ప, రజని నిలిచారని లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీ కృష్ణ తెలియచేశారు. విజేతలకు అద్దంకి మురళీ కృష్ణ ట్రోఫీలు అందచేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి విజయ్, రవిబాబు, రఘు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ముత్తుముల, ఉగ్ర

దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో వారిని ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని ఎండమావిగా మార్చిన కూటమి ప్రభుత్వం

## సబ్సిడీ రుణాలు, రిలీఫ్ నిధులు ఇవ్వకపోవడమే సుపరిపాలన

## సంవత్సరం పాలన పై దళిత నేత నీలం ధ్వజం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 13)**

సబ్సిడి రుణాలు, రిలీఫ్ నిధులు ఇవ్వకుండా దారి మళ్ళించి ఎస్సీ ఎస్టీల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ఎండమావిగా మార్చిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ మాల కార్పొరేషన్లకు 341 కోట్లు, మాదిగ, రెల్లి కార్పోరేషన్లకు వందల కోట్ల రూపాయలు గత ఆర్థిక సంవత్సరం 2024-2025 కేటాయించారేగాని ఒక్క రూపాయికూడా విడుదలచేయకపోవడమే కూటమి ప్రభుత్వ సుపరిపాలన అన్నారు. మరలా అదే నిధులను ఈ సంవత్సరం 2025-2026 మాల, మాదిగ కార్పొరేషన్ల సబ్సిడిగా చూపిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ నోటిఫికేషన్‌లో కూడా సబ్సిడి ఋణాలు పొందటానికి బి.సిలకు, ఇతర అగ్రకులాలకు 50 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 60 సంవత్సరాలు నిర్ణయించడమే కూటమి ప్రభుత్వ సుపరిపాలన అన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 11 పూలే జయంతి రోజున కాపు తదితర అగ్రకులాలలకు బిసిలతో పాటు వేల కోట్ల రూపాయలు సబ్సిడి ఋణాలు పంపిణీచేసి ఎస్సీ, ఎస్టీల నోళ్ళు కొట్టడమే సుపరిపాలన అన్నారు. తెలుగుదేశం ఎన్నికల మ్యానిఫెస్టోలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్ళకే వృద్ధాప్య పెన్షన్లు ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారన్నారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా వృద్ధాప్య వితంతు పెన్షన్లు ఇవ్వకుండా పాత పెన్షన్లనే పబ్లిసిటితో మంత్రులు, ఎంఎల్ఎ లు గ్రామాల్లో ఇవ్వడం సుపరిపాలన అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్రప్రభుత్వం నుండి వచ్చిన ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్స్‌ను కూడా కూటమి ప్రభుత్వం దారిమళ్ళించి బాదితులను ఆర్థిక అణిచివేతకు గురిచేయడమే సుపరిపాలన అన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు బ్యాక్‌లాగ్ పోస్టులు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం, ఎస్సీ, ఎస్టీల కులాంతర వివాహాల నిధులు నిలిపివేయడం సనాతన ధర్మ సుపరిపాలన అన్నారు. తల్లికి వందనం లాంటి లోకేష్ స్కీంకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నిధులు వినియోగించడం సుపరిపాలన అన్నారు. కరేడులో మరియు కనిగిరిలో ప్రైవేట్ పరిశ్రమలకు వందల ఎకరాలు భూములు బలవంతపు సేకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు స్మశానలకు ప్రభుత్వ భూములు కూడా మంజూరు చేయకపోవడం సుపరిపలన అన్నారు. ఎస్సీ, ఎస్టీల పై దాడులు జరిగినా ఎస్సీ, ఎస్టీ కేసులు కట్టకుండా, ఒక వేల కేసులు కట్టినా మహిళలచే బాదితులపై కౌంటర్ కేసులు కట్టడమే కూటమి ప్రభుత్వ సుపరిపాలన అని నీలం ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, గోగులమూడి రంజిత్, దేవరపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికి తంటాలు పడుతున్న గ్రామస్తులు





**వెలుగు, బేస్తవారిపేట, జులై 13)**

సమస్య చిన్నదే అయిన రోజుల తరబడి సమస్యను పరిష్కరించకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజుల క్రితం మంచినీటి బోరు చెడిపోవడంతో గ్రామంలోని ప్రజలు తాగునీటికి ఇక్కట్లు తప్పట్లేదు. రైతంగం ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలో బోరు చెడిపోవడంతో అధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రజలు వాపోతున్నారు. పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల పనితీరు పై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. త్వరతగిన గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్సీ తూమాటి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 13)**

మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని టెంకాయ చెట్ల పాలెం, కొత్తపల్లి పాలెం, పాత పల్లిపాలెం, చైతన్య నగర్, ఎస్సీ సంఘ కాలనీలో ఆదివారం ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు పర్యటించి ఇండో సోలార్ వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ముక్తకంఠంతో ఇండో సోలార్ పరిశ్రమ మాకు వద్దు, మా భూమి మాకు ముద్ద అంటూ గట్టిగా చెప్పడం జరిగినది. ఈ విషయంపై స్పందించిన మాధవరావు గురువారం నెల్లూరులో డిఆర్సీ మీటింగ్ జరుగుతుందని దానిలో ప్రజల ఆకాంక్షపై స్పష్టంగా మాట్లాడుతానని హామీ ఇచ్చారు. అదే విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డికి ప్రజలు చనిపోయిన విషయాలపై స్పష్టంగా రిపోర్ట్ ఇస్తానని మాధవరావు తెలిపారు. ప్రజల పక్షాన నేను ఎప్పుడు ఉంటానని అందులో భాగంగానే గ్రామ సభకు కూడా హాజరవటం కూడా జరిగినదని ప్రజల తరపున ఆగస్టులో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో సైతం శాసనసభలో ప్రజల పక్షాన పోరాడుతానని మాధవరావు అన్నారు.



# లారీ కారు ఢీ ఒకరు మృతి, ఒకరికి గాయాలు

**(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, జులై 13)**

మండలంలోని చింతలపాలెం దగ్గర లారీ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మృతుడు గిద్దలూరు మండలం ఆదిమూర్తి పల్లి గ్రామానికి చెందిన సిరిగిరి ఓబయ్య మాజీ ఆర్మీ ఉద్యోగిగా గుర్తించారు.



# అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లకు రూ.180 కోట్ల తక్షణమే కేటాయించాలి

## నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 13)**




ఆంధ్రప్రదేశ్ పట్టణ నివాస , మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ గృహ నిర్మాణ పథకం ద్వారా ఒంగోలు నగరంలో కొప్పోలు, చింతల దగ్గర 4128 గృహములు సుమారు 348.58 కోట్ల రూపాయలతో గత తెలుగుదేశం ప్రభుత్వం కాలంలోనిర్మాణం చేపట్టడం జరిగింది. జి ౦3 అపార్ట్మెంట్ తరహాలో ఈ నిర్మాణం చేపట్టారు. 254 4గృహాలు 300 చదరపు అడుగులు విస్తీర్ణంలో, 624 గృహాలు 365 చదరపు అడుగులు విస్తీర్ణంలో, 960 గృహాలు 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టారు. చింతల దగ్గర 1392 ఇళ్లకు గాను 66% పూర్తయింది.. కొప్పోలు దగ్గర 2736లో గాను 52.86% పూర్తయింది. గత ప్రభుత్వం ఎస్‌పిసిఎల్ లిమిటెడ్ ముంబై వారితో కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. చింతల దగ్గర ఎల్ టి కంపెనీ ముంబై వాళ్ళతో కాంట్రాక్టు కుదుర్చుకుంది. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పెట్టి ఎమ్మెస్ ఇంద్రజిత్ గుప్తా కన్స్ట్రక్షన్ న్యూఢిల్లీ వారికి కట్టబెట్టింది. వీరికి 11.68 కోట్లు కేటాయించాలి. ఎమ్మెస్ కస్తూరి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారికి ఇంకా 13 కోట్లు కేటాయించాలి. మురుగునీరుపారుదలకు పబ్లిక్ హెల్త్ కి నిధులు కేటాయించాలి. విద్యుత్ సరఫరాకు ఇంకా 5.8 కోట్లు కేటాయించాలి. మొత్తం ఈ నిర్మాణ పనులు పూర్తి కావాలి అంటే రూ.180.50 కోట్ల రూపాయలు నిధులు అవసరమవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి ఈ కిట్ కో ఇళ్లను లబ్ధిదారులకు హ్యాండ్ ఓవర్ చేయవలసిందిగా సిపిఎం ఒంగోలు నగర కమిటీ డిమాండ్ చేస్తుంది. ఈరోజు పార్టీ నగర కమిటీ సమావేశం జి రమేష్ అధ్యక్షతన సుందరయ్య భవనంలో జరిగినది పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ 2018 లో ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభించి ఇప్పుడు ఏడు సంవత్సరాల లబ్ధిదారులకు ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రివర్స్ టెండర్స్ పి లిసి కాలయాపన చేయటం తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు, నిధులు విడుదల చేయలేదు. ఇప్పుడైనా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన ఒక్క పైసా కూడా నిర్మాణానికి కేటాయించకపోవడం విచారించ దగ్గర విషయం. అందువల్ల తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగాది నాటికి ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతున్నాము.. బ్యాంకుల దగ్గర లోన్లులబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వడ్డీలు, లబ్ధిదారుని వాటా మరియు ఇంటి ఎద్దులు చెల్లించలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నార.అందువల్ల తక్షణమే ప్రభుత్వం ఇల్లు ఇవ్వాలని కోరుతున్నాము.లేని పక్షంలో లబ్ధిదారులతో ప్రత్యక్ష ఆందోళన చేస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తంబి శ్రీనివాసులు, వీరాస్వామి, టీ మహేష్, బివి రావు, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి టీడీపీ నేతల ప్రచారం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 13)

సుపరిపాలనలో తొలిగడుగు కార్యక్రమంలో భాగంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పొదిలి పట్టణంలోని బూత్ నెంబర్ 232లో ఆదివారం ఇంటింటికి టీడీపీ నేతల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ మీగడ ఈశ్వర్‌రెడ్డి, వార్డు అధ్యక్షులు పచ్చవ సుబ్బారావు, బారి షహిద్, తదితరులు పాల్గొన్నారు.

# కమ్మవారి సేవా సమాఖ్య సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

### రాష్ట్ర స్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ పిలుపు

### అన్ని జిల్లాలను భారీగా ప్రతినిధులు హాజరు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 13)

కమ్మవారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక సేవకార్యక్రమాలు విస్తృతం చేసేందుకు ప్రతి ఒక్క కమ్మ సామాజిక మేధావులు పెద్దలు ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడ గురునానాక్ కాలనీలోని ఫన్ టైమ్స్ రిక్రియేషన్ సెంటర్లో ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవాసమాఖ్య రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సభ్యులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన అనంతరం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మండవ రమ సంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమానికి కమ్మవారి సేవా సమాఖ్య గౌరవ అధ్యక్షులు డాక్టర్ గన్ని భాస్కరరావు సభా అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ చాలావరకు ఐక్యత లేకపోవడం వల్ల అనేక కార్యక్రమాలు చేయటానికి సాధ్యపడటం లేదని, పెద్దలు సభ్యుల సహకారంతో ఆర్థికంగా నిధి సేకరణ చేసి మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమాలు జరిపేటప్పుడు అనేక సమస్యలు, సవాళ్లు ఎదురైనా కమ్మవారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సమాయత్తం అయ్యేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం కమ్మ కులానికే





కాకుండా ఇతర వర్గాలలోని పేదలను గుర్తించి వారికి విద్య ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో అమరావతిలో రాష్ట్రస్థాయి కమ్మ భవన్ కార్యాలయ నిర్మాణానికి, డిజిటల్ మరియు భౌతిక గ్రంథాలయాలు ఏర్పాటు కోసం సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. దీనితోపాటు విద్యా ఉద్యోగ సలహాలు హాస్టల్ వసతులు కల్పించే సేవా బృందంతో పాటు పోటీ వైద్య ఆర్థిక సహాయం అవసరమైన వారికి వేగవంతంగా అందించడం ముఖ్య ఉద్దేశంగా ఉండాలని పేర్కొన్నారు. ఇంకా అనేక కార్యక్రమాలు ముమ్మందు కమ్మవారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సభ్యుల సహకారం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. గూడూరు సత్యనారాయణ,సూరపనేని స్వరూప రాణి, మందలపు జగదీష్,గుమ్మడి రామకృష్ణ, కనకమెడల శ్రీనివాస చక్రవర్తి,బొర్రా గాంధీ, జీవి రాయుడు, సామినేని కోటేశ్వరరావు,నల్లూరి చలపతిరావు, కృష్ణ ప్రసాద్, తదితరులు

# కందుకూరులో జిల్లా అభ్యాస వర్గ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 13)

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రకాశం జిల్లా అభ్యాస వర్గ కార్యక్రమం కందుకూరులోని ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. ఈ శిక్షణా తరగతులలో పలు విషయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి పాటుపడాలని, కార్యకర్తలను పెంచుకోవాలని తెలిపారు. రాష్ట్ర సహాధ్యక్షులు చక్రపాణి మాట్లాడుతూ ఆపస్ కార్యకర్త అంటే వ్యవస్థలో ఆదర్శంగా ఉండాలని తెలియజేశారు. సంఘటన కార్యదర్శి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల క్షేమం కోసమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం మనం పాటుపడాలన్నారు. విద్యావ్యవస్థను బాగు చేయాలంటే ఉపాధ్యాయులే మూలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి ఆకురాతి బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఉపాధ్యాయులకు రావలసిన డిఏలు, బకాయిలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులు కే మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలలో ఆపస్ వృద్ధి చెందాలని తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరులో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



## తల్లికి వందనం లబ్ధిదారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే కందుల సతీమణి వసంతలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 13)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి మార్కాపురం పట్టణంలోని 7వ వార్డులో తల్లికి వందనం లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మబడి వచ్చేదని, ఇప్పుడు తల్లికి వందనం పథకంలో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల అకౌంట్లో డబ్బు జమ చేయడం జరిగిందని ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కి తమ కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా వార్డులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఫ్లెక్సీకి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వార్డులో మహిళలు కేకును కట్ చేసి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం నాయకులు, మహిళలు, తల్లికి వందనం లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా బూదాల



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 13)

మార్కాపురం మండలం వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ ప్రెసిడెంట్‌గా బూదాల గురవయ్యని నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం గురవయ్య మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ పార్టీ మాజీ అధ్యక్షుడు, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి ఆయన తనయుడు జంకె రామాంజనేయరెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మండల పార్టీ కన్వీనర్ పోరెడ్డి చెంచిరెడ్డి, స్టేట్ వాల్మీకి మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, శివరాంపురం సర్పంచ్ డి నాదా గురు బ్రహ్మం, మందాటి శివారెడ్డి, తుమ్మ వెంకట్‌రెడ్డి, పంబి వెంకటరెడ్డి, రమణా రెడ్డి, గౌస్ మొయిద్దీన్, సుబ్బారెడ్డి, కొత్తపల్లి గాలిరెడ్డి, బూదాల థామస్, మందగాలయ మోహన్‌రావు, వెలుగొండయ్య, కిరణ్ ,అశోక్, చిన్న శాలెం, రవితేజ, జోసఫ్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగాస్టార్ చిరంజీవిని కలిసిన బడేవారిపాలెం వాసి బొమ్మల చిరంజీవి

## నా జీవితం ధన్యమైంది : బొమ్మల చిరంజీవి



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 13)**

తన అభిమాన నటుడు మెగాస్టార్ చిరంజీవిని కలవడం, చిరంజీవి తనతో రెండు గంటలు గడపటం తన జీవితంలో మధుర క్షణాలని, తన జీవితం ధన్యమైందని బడేవారిపాలెం గ్రామానికి చెందిన బొమ్మల చిరంజీవి తన సంతోషం వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో తన అభిమాన నటునైనా మెగాస్టార్ చిరంజీవిని ఎలాగైనా కలవాలని సంకల్పం బొమ్మల చిరంజీవి కల శనివారం నెరవేరింది. తన నూతన గృహప్రవేశం రోజున దేవుని చిత్రపటానికి బదులు తన ఇష్ట దైవమైన మెగాస్టార్ చిరంజీవి ఫోటో పెట్టుకుని గృహప్రవేశం చేసిన వీరాభిమాని బొమ్మల చిరంజీవి. అటువంటి చిరంజీవి ఈరోజు హైదరాబాదులో సినీ నటుడు చిరంజీవి ఇంట్లో వారిని కలవడం వారితో సుమారు రెండు గంటల పాటు సినీ నటుడు చిరంజీవి గడిపాడు. కొన్ని అనారోగ్య కారణాల వలన బొమ్మల చిరంజీవి భార్యకు కాళ్లు సచ్చుబడిపోవడంతో వీల్ చైర్ లోనే తన అభిమాన నటుడు చిరంజీవి వద్దకు తీసుకెళ్లాడు. తాను చిరంజీవి లాగా ప్రతిపాటకి వేసిన డాన్స్ ను చిరంజీవికి చూపించారు. మెగాస్టార్ చిరంజీవి బొమ్మల చిరంజీవిని అభినందించాడు. అనంతరం వారి కుటుంబ సభ్యులన బొమ్మలు చిరంజీవి తండ్రి, వారి కూతురుతో సినీ నటుడు చిరంజీవి ఫోటో దిగి గుర్తుగా బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మల చిరంజీవి మాట్లాడుతూ తన ఇష్టదైవమైన సినీ నటుడు చిరంజీవిని కలవడం తన జీవితంలో మరుపురాని సంఘటన అని, తన జన్మ అన్యమైందని ఆనందభాష్పాలు కార్చాడు. ఈ కార్యక్రమంలో పునుగోటి రాజా, బీరకాయల శ్రీనివాసులు పాల్గొన్నారు.





# నోరు అదుపులో లేకపోతే రాష్ట్రం నుంచి తరిమి కొడతారు - యాగంటి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 13)**

మాజీ మంత్రి పేర్ని నాని, నెల్లూరుకు చెందిన ప్రసన్న కుమార్‌రెడ్డిలు నోటికి వచ్చినట్టు మాట్లాడితే జనం రాష్ట్రం నుంచి తరిమి కొడతారని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం యాగంటి మాచర్ల పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా చేసిన పేర్ని నాని నోటికి వచ్చినట్లు మాట్లాడి రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా నాని మాట్లాడ్డం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. రాత్రిపూట కన్ను కొడితే చేయాల్సిందంతా చేసేయాలని వైకాపా క్యాడర్ను రెచ్చగొట్టడం నాని దిక్కుమాలిన రాజకీయానికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎక్కడికి వెళ్ళినా అక్కడ గొడవలు చేయాలని చూడటం వైకాపా నీతిమాలిన రాజకీయానికి నిదర్శనం గా పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మీ ఇష్టం వచ్చినట్లు చేయండి నేను చూసుకుంటాను అంటూ నాని మాట్లాడ్డం హత్య రాజకీయాలను ప్రోత్సహించడమే అవుతుంది అన్నారు. వైకాపా క్యాడర్ ని రెచ్చగొడుతూ రాత్రిపూట ఏదో ఒకటి చేయమని చెబుతున్న నాని నీకు చేతనైతే పగటిపూట రావాలని సవాల్ విసిరారు. మొన్న ఎలక్షన్లో కనీసం 11 సీట్లు అయినా వైకాపాకు వచ్చాయి, ఇలా అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలే మీ పార్టీకి బుద్ధి చెప్తారని హితవు పలికారు. నెల్లూరులో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి మహిళల విషయంలో ఇష్టానుసారం మాట్లాడడంతో తగిన శాస్తి మహిళలు చేశారన్నారు. మహిళలను గౌరవించడం చేతకాని ప్రసన్న కుమార్ రెడ్డికి రాజకీయంగా మాట్లాడే అర్హత ఎక్కడదని ప్రశ్నించారు. వైకాపాలో అందరూ జగన్ మనస్తత్వం కలవారే ఉన్నారని పేర్కొన్నారు. జగన్ తన సొంత తల్లిని, చెల్లిని అడ్డగోలుగా మాట్లాడుతున్న పట్టించుకోలేదన్నారు. జగన్ వెనకున్న వాళ్లకు మాత్రం మంచి బుద్ధులు ఎలా వస్తాయని ఎద్దేవా చేశారు. తెదేపా చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైకాపా నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు అన్నారు. ఏడాది పాలన లో తెదేపా చేస్తున్న అభివృద్ధిని చూసి జగన్ విధ్వంసానికి రూపకల్పన చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని ప్రజలు గమనించి తెదేపాకు పట్టం కట్టి,కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుకు సహకరించారని పేర్కొన్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో జగన్ తన అనుచరులను రెచ్చగొడుతూ ఎక్కడికక్కడ గొడవలు సృష్టించాలని ప్రేరేపిస్తున్నట్లు అర్థమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని విషయం ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలని చెప్పారు. అడ్డగోలుగా మాట్లాడిన నాని, ప్రసన్నకుమార్‌రెడ్డి విషయంలో పోలీసు వ్యవస్థ చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో మాజీ కౌన్సిలర్ సంతోష్, తిక్క కొండలు, దుర్భకుల ప్రసాద్, గాజుల ఆంజనేయులు, బాదంబాయి, బొట్టు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వైవీని కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 13)**

హైదరాబాద్‌లో వైసీపీ రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని ఆదివారం వారి నివాసంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సన్మానించారు. అంతరం నియోజకవర్గంలో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. 2029 మన ప్రభుత్వం అధికారంలో రావడం కాయం అన్నారు. మన నాయకులు, కార్యకర్తలు, కూటమి ప్రభుత్వం మెక్క ఆవినితి, అక్రమాలు ఎప్పటికీ అప్పుడు ప్రజలకు తెలియజేసి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ భూమిరెడ్డి సుబ్బారెడ్డి, యర్రగొండపలెం మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, పుల్లలచెరువు మండల వైసీపీ నాయకులు ఆవుల కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లె విద్యార్థిని నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపిక

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 13)**



గిద్దలూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో చదువుతున్న షేక్ రిహానా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు ఎంపికైంది. గత ఏడాది 8వ తరగతి చదువుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష రాయడానికి హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య గైడెన్స్, ఆర్థిక సహాయంతో నమోదు చేయడం జరిగింది. ఈ పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్, పరీక్ష ఫీజులను తదితర విషయాలను హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ పిచ్చయ్య ఆర్థిక సహకారం అందించారు. 10 మంది విద్యార్థులను పరీక్షకు ప్రిపేర్ చేశారు. పాఠశాల మ్యాథ్స్ టీచర్ ధనార్జున రెడ్డి, సైన్స్ టీచర్లు వరలక్ష్మి, రమాదేవి, ఇంగ్లీష్ టీచర్ నాగరాజు, సోషల్ ప్రమీల తదితరులు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ స్కాలర్షిప్ ఎంపికైన షేక్ రిహానను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి , ఉపాధ్యాయులు అభినందించారు.

# కోడి పందెంరాయుళ్ల అరెస్ట్



**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 13)**

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఉత్తర్వుల మేరకు డీఎస్పీ లక్ష్మినారాయణ, సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి పొలాల్లో కోడి పందాలు ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కోడిపందాలు ఆడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో వారి వద్ద నుంచి రూ.11,200 నగదు, రెండు కోళ్లు, 10 మొబైల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

# గ్రామాల అభివృద్ధి కూటమి సర్కార్‌తోనే సాధ్యం

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 13)

ఏడాది పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గుడ్లూరు మండలం పొట్లూరు గ్రామంలో ఎస్టీ కాలనీలో గ్రామంలో ఆదివారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ తొలి సంవత్సరంలో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. రానున్న నాలుగు సంవత్సరాల లో అమలు నియోజకవర్గం లో జరగబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్న అన్నారు. చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో కందుకూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పొట్లూరు గ్రామంలో ప్రజలు తమకు నూతన కాలువలు రోడ్ల సమస్య చెప్పగా వెంటనే ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి తప్పకుండా కాలువలు రోడ్లు నిర్మిస్తామని ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జగన్ గత ఐదేళ్ల పాలనలో విసిగి వేసారి పోయిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి 164 స్థానాలతో బ్రహ్మరథం పట్టారని గుర్తు చేశారు..జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సర్వనాశనం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవంతో ఇచ్చిన హామీలు అమలు చేయడం ప్రజలలో కూటమి ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని నిలబెట్టింది అన్నారు. దేశంలో 4000 పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అని అన్నారు.వైకాపా ఐదేళ్ల పాలనలో రౌడీయిజం గుండాయిజం తప్ప ఏం చేసిన అభివృద్ధి ఏమీ లేదని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఏదో ఒక అలజడి సృష్టించి శాంతిభద్రతలు విఘాతం కలిగించేలా చేయాలని జగన్ రెడ్డి, వైకాపా నాయకులు ఆలోచిస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గ్రామస్తులు మరియు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు, పొట్లూరు గ్రామంలో ఎమ్మెల్యే వెంకటేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు గ్రామ పార్టీ అధ్యక్షుడు పాతపల్లి శ్రీనివాసరాజు గ్రామ నాయకులు రహంతుల్లా, సుబ్బారావు, మస్తాన్ పార్టీ నాయకులు ఉమ్మనేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవులు, మేకల మాల్యాద్రి, ఉన్నం వెంకటేశ్వర్లు మద్దసాని శీను, షేక్ బాబు, పోలుగంగు కృష్ణ గద్దగుంట శ్రీను, నరాల మాలకొండ రెడ్డి, యానాది, బొబ్బూరి నాగేశ్వరరావు, వీరంరాజు, అల్లం సుమతి, జొన్నలగడ్డ రవణమ్మ, జాజుల కొండయ్య కృష్ణయ్య, అట్ల కోటయ్య, గుత్తా మాలకొండయ్య, అక్కిలగుంట ప్రకాశం, అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# వైసీపీ ప్రముఖులను కలిసిన కాటూరి లక్ష్మీ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 13)

ఇటీవల పొదిలి నగర పంచాయతీ వైఎస్సార్సీపీ పదవులను పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో పొదిలి నగర పంచాయతీ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా కాటూరి లక్ష్మీని నియమించింది. ఈ మేరకు ఆదివారం ఆమె మార్కాపురం లోని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు, నగర పంచాయతీ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డిని కలిసి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాటూరి అశోక్, రబ్బాని, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాటూరి లక్ష్మి మాట్లాడుతూ రాబోయే 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.







# 11మంది పేకాట రాయుళ్లు అరెస్టు

(షణ్ముఖ వెలుగు, నాగులుప్పలపాడు, జులై 13)

మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామంలో పేకాట ఆడుతున్న 11మంది జుదారులను అరెస్ట్ చేసినట్లు నాగులుప్పలపాడు ఎస్ఐ షేక్ రజియా సుల్తానా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారి వద్ద నుంచి రూ.46,330 నగదును సీజ్ చేసి, స్వాధీనం చేసుకొని, సదరు జుదారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రజియా సుల్తానా బేగం మాట్లాడుతూ మండల పరిధిలో ఎవ్వరూ చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. ముఖ్యంగా కుటుంబ బాధ్యతలను విస్మరించి పేకాట లాంటి జూదాలకు పాల్పడి కుటుంబాలను రోడ్డున పడేలా చేసుకోవద్దని చూసించారు. అలాంటి జూద క్రీడలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా మీ గ్రామీణ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పేకాట జూదాలు ఆడుతున్న వారి సమాచారం అందజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com